## క్లుప్తంగా

### శ్రీశైలానికి పాదయాత్రగా శివస్వాములు



**మానవపాడు:** మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం శివమాలధారులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మానవపాడు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. దివంగతులైనా పూర్వ విద్యార్థులు నబీరసూల్, శ్రీనివాసులు, బలరాముడు, నాసిర్, వెంకటేశ్వర్లు, పూజారి జనార్ధన్, మల్లికార్జున్, నాగర్జున్, జాన్సీ, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, యదార్‌సబ్ తదితరులకు నివాళులర్పించారు. గత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా కొత్వాల్




**స్టేషన్ మహబూబ్‌నగర్:** మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కోఆర్డినేటర్‌గా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ నియమితులయ్యారు. నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఆయన కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్లను సమీకరించి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని కొత్వాల్ తెలిపారు.

### మోడల్ టెస్టుకు అపూర్వ స్పందన

**ఆత్మకూర్:** నవోదయ, గురుకులాల్లో ప్రవేశానికి సంబంధించి ఆదివారం విద్యార్థులకు నిర్వహించిన మోడల్ టెస్టుకు అపూర్వ స్పందన లభించినట్లు నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్, మీర్జా అక్తర్‌బేగ్ తెలిపారు. స్థానిక వికాస్ కళాశాలలో నిర్వహించిన మోడల్ టెస్టుకు ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు భారీగా హాజరైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదో తరగతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతున్నాయని.. విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు మోడల్ టెస్టు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### మహాసభలను జయప్రదం చేయండి



**మక్తల్:** తెలంగాణ రాష్ట్ర ప్రగతిశీల హమాలీ అండ్ రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ కోరారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆదివారం మక్తల్ మార్కెట్‌యార్డులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3లక్షల మందికి పైగా హమాలీలు పనిచేస్తున్నారన్నారు. వారందరికీ రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించతలపెట్టిన మహాసభలకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మన్న, రాజు పాల్గొన్నారు.

### కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

**మద్దూరు:** జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన 24వ నేషనల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్‌లో పెదిరిపాడ్ కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. వివిధ విభాగాల్లో ఆరో తరగతి విద్యార్థిని మల్లీశ్వరి, ఏడోతరగతి విద్యార్థిని అక్షిత గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఆరో తరగతికి చెందిన తేజస్విని సిల్వర్, భార్గవి రజత పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గౌరమ్మ తెలిపారు.

# నంబర్ ప్లేట్లు.. లేవు నిబంధనలు

- ఏర్పాటు ప్రక్రియపై విమర్శలు
- ఒక్కొక్క ప్లేట్‌కు రూ. 60 వసూలు
- నాసిరకంగా ఉన్నాయంటూ ఆరోపణ



నంబర్ ప్లేట్ అమర్చుతున్న సిబ్బంది(ఫైల్)


**అయిజ:** మున్సిపాలిటీలోని ప్రతి ఇంటికి నంబర్ ప్లేట్ల అమర్చే ప్రక్రియను ఇటీవల మున్సిపల్ అధికారులు చేపట్టారు. నంబర్ ప్లేట్ అమర్చినందుకు గాను ఇంటి యజమాని నుంచి రూ.60 వసూలు చేయడంతోనే సమస్య మొదలైంది. ఇంటి పన్ను చెల్లిస్తున్నాం కదా నంబర్ ప్లేట్ ఏర్పాటుకు కూడా డబ్బులు వసూలు చేయడం ఏంటని ప్రజలు మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వమే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించాలని ప్రజలపై భారం పడకుండా చేయాలని కోరుతున్నారు.

**కౌన్సిల్‌లో తీర్మానం..**

మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి నంబర్ ప్లేట్ అమర్చేందుకు జనవరి 8న కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. దీనిపై డాల్ఫిన్ రూరల్ డెవలప్‌మెంట్ అర్బన్ సొసైటీ దరఖాస్తు చేసుకోగా మున్సిపాలిటీ పరిధిలోని ఆన్‌లైన్‌లో నమోదైన వివరాల ఆధారంగా నంబర్ ప్లేట్లను అలాట్ చేసేందుకుగాను వర్క్ ఆర్డర్ ఇచ్చేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఒక్కో నంబర్ ప్లేట్ అమర్చేందుకు కాంట్రాక్టర్‌కు ప్రతి ఇంటికి రూ.60 చొప్పున చెల్లించాలని తీర్మానంలో పేర్కొన్నారు. అయితే కాంట్రాక్టర్‌కు ఇంటి యజమాని చెల్లించాలా లేక మున్సిపల్ కార్యాలయం నుంచి చెల్లింపులు జరగాల అనే దానిపై స్పష్టత కొరబడింది.

**నాసిరకంగా నంబర్ ప్లేట్లు..**

మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి ఏర్పాటు చేసేందుకు తయారు చేసిన నంబర్ ప్లేట్లు నాసిరకంగా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రూ.10 కంటే ఎక్కువ ఉండదని కానీ నంబర్ ప్లేట్ అమర్చినందుకు గానూ రూ.60 వసూలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. నంబర్ ప్లేట్లపై ఇంటి నంబర్, అడ్రస్, అసెస్మెంట్ నంబర్ ప్రింట్ చేయలేదని, దానిపై మార్కర్‌తో రాయడం వలన కొన్ని రోజులకు అది కనుమరుగైపోతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే ప్లేట్లు అమర్చిన ఇంటి యజమానులు నుంచి డబ్బులు వసూలు చేశారు. ఈ ప్రక్రియపై ప్రజల నుంచి విమర్శలు రావడంతో మున్సిపల్ అధికారులు నంబర్ ప్లేట్ల అమర్చే ప్రక్రియ నిలిపి వేశారు.




మార్కర్‌తో చిరునామా రాసిన నంబర్ ప్లేట్

**ప్రభుత్వమే చెల్లించాలి..**



ఇంటి నంబర్ ప్లేట్‌కు ఒక్కొక్క ఇంటికి కాంట్రాక్టర్ సిబ్బంది రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇంటి పన్ను చెల్లిస్తున్నాం. అయినా నంబర్ ప్లేట్ అమర్చేందుకు కూడా ప్రజల నుంచి డబ్బు వసూలు చేయడం సరి కాదు. ప్రభుత్వమే ఇంటి నంబర్ ప్లేట్ అమర్చినందుకు కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించాలి. ప్రజలపై భారం పడకుండా చూడాలి.

\- మహబూబ్ బాష, అయిజ

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..**



కాంట్రాక్టర్ ఏర్పాటు చేస్తున్న నంబర్ ప్లేట్ నాసిరకంగా ఉంది. కనీసం రూ.10 కూడా విలువ చేయని ప్లేట్ అమర్చి రూ.60 వసూలు చేస్తున్నారు. ప్లేట్‌పై ఇంటి నంబర్, చిరునామా, అసెస్మెంట్ నంబర్ ముద్రించడం లేదు. మార్కర్‌తో రాయడం వలన కొన్ని రోజులకే అది చెదిరి పోతుంది. ఈ విషయంలో అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

\-యువ తేజేశ్వర్‌రెడ్డి, అయిజ

**అమర్చే ప్రక్రియ నిలిపివేశాం..**



ఇంటి నంబర్ ప్లేట్ల ఏర్పాటు ప్రక్రియపై జనవరి నెలలో తీర్మానం చేశారు. నంబర్ ప్లేట్ ఏర్పాటుకు రూ.60 కాంట్రాక్టర్ బిల్లు మున్సిపల్ కార్యాలయం చెల్లించాలా లేక ప్రజలు చెల్లించాలా అనే విషయం స్పష్టత లేదు. ప్రజల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో నంబర్ ప్లేట్ల అమర్చే ప్రక్రియ నిలిపి వేశాం. చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- సైదులు, మున్సిపల్ కమిషనర్

## ఘనంగా తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



దర్శనం చేసుకుంటున్న భక్తులు



పొర్లుదండాలు పెడుతున్న మహిళ

**అయిజ:** పట్టణంలో తిక్కవీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర బ్రహ్మోత్సవలకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం సీఐ టాటాబాబు, ఎస్‌ఐ శ్రీనివాసరావు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కర్నాటకు చెందిన కొందరు భక్తులు ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెడుతూ మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు ఆదివారం రాత్రి శాంతి హోమం జరిపించారు. ప్రభోత్సవాన్ని కనులపండువగా వీక్షించారు. చిన్న రథంపై ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. స్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

## పెండింగ్ క్లెయిమ్ డబ్బులు చెల్లించాలి

**అమరచింత:** భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయిమ్ డబ్బులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడితే 1996లో కేంద్ర గవర్నమెంట్ దేశంలో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. మన రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం కార్మికులు అనేక దఫాలుగా పోరాటం చేయడం వల్ల 2009లో తెలంగాణ రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమబోర్డు వచ్చిన తర్వాత కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్ తక్కువగా చెల్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు అందాల్సిన క్లెయిమ్స్ అందే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అనంతరం భవన నిర్మాణ మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడిగా జిలానీ, ఉపాధ్యక్షుడిగా శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మన్నెం, సహాయ కార్యదర్శిగా మనోహర్, కోశాధికారిగా అంజిలతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకోన్నారు.



భవన నిర్మాణ సంఘం మండల నూతన కమిటీ సభ్యులతో జిల్లా సహాయ కార్యదర్శి రాజు

### ఉపాధి భద్రత కల్పించాలి



**కోయిల్‌కొండ:** రాష్ట్ర ప్రభుత్వం హమాలీలకు ఉపాధి భద్రతతో పాటు సమగ్రమైన చట్టం రూపొందించాలని టీయూసీఐ (ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని అభంగపట్నంలో హమాలీ, మిల్‌వర్కర్స్ యూనియన్ కార్మికులతో కలిసి ఈనెల 21న ఖమ్మంలో జరిగే రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను విడుదల చేశారు. మండలంలోని కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు నారాయణ, ఆంజనేయులు, కేశవులు, శేఖర్, వెంకటయ్య, రాకమయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## కరాటే చాంపియన్‌షిప్‌లో పతకాలు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన 4వ ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా పట్టణ ఉపాధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయా విభాగాల్లో వి.సాయి వర్షిణి, ఆర్.ప్రకాశ్ బంగారు పతకాలు, కె.శ్రీచరణ్ చారి రజత పతకం పొందినట్లు తెలిపారు. విద్యార్థులకు తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ట్రెజరర్ రామస్వామి పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు పతకాలు సాధించడంపై జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.కృష్ణయ్య హర్షం వ్యక్తంచేశారు. విద్యార్థులకు కరాటే శిక్షణ అందజేస్తున్న మాస్టర్లు నవీన్‌కుమార్, తిమ్మప్పను అభినందించారు.



పతకాలు అందుకుంటున్న విద్యార్థులు

## ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి

**కొత్తకోట రూరల్:** సృష్టిలో ప్రథమ గ్రంథం భగవద్గీత అని, అందుకే ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంత, ఇందు ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక కొత్తకోట, పెబ్బేరు కమిటీ అధ్యక్షులు విజయ భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. శివ రాత్రి పండుగ విశిష్టతను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజఫర్‌ఖాన్, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ ఉన్నారు.



రామకృష్ణాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

## శాంతిభద్రతలు కాపాడండి

**అయిజ:** మండలంంలో శాంతి భద్రతలు కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ పోలీసులను కోరారు. ఆదివారం ఎస్‌ఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ.. గ్రామాల్లో దొంగలు రెచ్చిపోతున్నట్లు, రౌడీయిజం, గూండాయిజం పెరిగిపోతుందన్నారు. కొందరు నాయకులు నేరప్రవృత్తని ప్రోత్సహిస్తున్నారని వాటిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ గౌడ్, మహేష్, రాజశేఖర్, భీమన్న, నవీన్ కుమార్, శివ రామ కృష్ణ, సాయి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఐకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## కనులపండువగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

- నేడు స్వామి వారి రథోత్సవం

**ధరూరు :** మండల పరిధిలోని అల్వలపాడులో తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రెండో రోజైన ఆదివారం సాయంత్రం ఆలయంలో ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీ సేవలు జరిపించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న స్వామి వారిని జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు కర్నాటకకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు తాగునీటి వసతితో పాటు ఇతర ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 17న సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

## అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి

**గట్టు:** నేటి యువత డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ కోరారు. ఆదివారం మాచర్ల గ్రామంలో అంబేడ్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలు రూపు మాపాలని అంబేడ్కర్ కృతనిశ్చయంతో పని చేసినట్లు తెలిపారు. అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శమని, ముఖ్యంగా నేటి యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. దళిత బహుజనులు ఐక్యం కావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కరిస్ట్ వేమన్న, కళాకారుడు చరణ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ముక్కెరన్న, దేవప్ప, బల్గెర ఏసన్న, ఏసురాజు, ఎస్‌జీ.నర్సింహులు, ప్రతాప్, జయరాజ్ మాచర్ల గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చరిత్ర పుస్తకాలతో గ్రామస్తులు

## వేడుకగా ఆలయ వార్షికోత్సవం

**అయిజ:** పట్టణ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేదపండితులు ఆలయంలో సుప్రభాత సేవ, స్వస్తిపారాయణం, మూలవిరాట్లకు అభిషేకం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. అదే విధంగా సర్వతోభద్ర మండలి పూజ, హోమ ప్రజ్వలన, ధ్వజారోహణం, మహా నైవేద్యం, తీర్థప్రసాద వితరణ, అంకురార్పణ మూల విరాట్ల హోమం, బలిహరణ కార్యక్రమాలు జరిపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

**ఆత్మకూర్:** ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజలకు పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రలందరు కలిసిరావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూర్‌కు వచ్చిన ఆయనకు సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్, ఆవాజ్ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తనపై నమ్మకంతో సీపీఎంపార్టీ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతను అప్పగించిందని ప్రతినిత్యం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, తనను సత్కరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాబర్ట్, మోష, సీఎన్‌శెట్టి, లక్ష్మణ్, మాసన్న, జానకీరాం, జహంగీర్, దండు శ్రీను, గయాసుద్దీన్, ఖాజాపాష, భట్టిపాష, జూరాల పాష, ఖలీల్, తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## అనారోగ్యం పాలవుతున్నా పట్టదా..?

- కంకర వేసి వదిలేసిన వైనం
- మరమ్మతుకు గురవుతున్న వాహనాలు
- ప్రమాదాలు, రోగాల బారిన పడుతున్న ప్రజలు



దుమ్ము, ధూళితో శాంతినగర్- వడ్డేపల్లి ప్రధాన రహదారి

**శాంతినగర్ :** అసంపూర్తిగా రోడ్డు పనులు వదిలేయడం, కాంట్రాక్టర్ల, పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ నుంచి వడ్డేపల్లి శివారు వరకు ఐదు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టారు. గుంతలమయమైన బీటీ రోడ్డును జేసీబీతో తవ్వి కంకర పరిచి వదిలేశారు. దీంతో కంకరమయమైన రోడ్డుపై ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**రోగాల బారిన పడుతున్నారు..**

రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపేయడంతో వాహనాలు వెళ్లినప్పుడల్లా రేగుతున్న దుమ్ము ధూళితో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి వెంటనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇళ్లలో ఉండలేక పోతున్నాం..**



రోడ్డు పనులు మధ్యలోనే ఆపేశారు. రోడ్డును తవ్వి కంకర, డస్ట్ వేసి వదిలేశారు. దీంతో ఇళ్లలోకి దుమ్ము, ధూళీ చేరుతోంది. వంట సామాగ్రి, వండిన వంటలోనూ దుమ్ము పడుతోంది. దుమ్ము బారిన పడి అనారోగ్యంతో ఆసుపత్రుల పాలవుతున్నాం. తొందరగా బీటీ వేసి రోగాల బారిన పడకుండా ప్రజలను కాపాడాలి.

\- స్వాతి, శాంతినగర్

**ప్రమాదాల బారిన పడుతున్నాం..**



కంకర వేసి వదిలేయడంతో వాహనాలు అదుపు తప్పి తరచు ప్రమాదాల బారిన పడుతున్నాం. తెలంగాణ, రాయచూర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే దారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అధికారులు వెంటనే రోడ్డు పనులు మొదలుపెట్టి సమస్య పరిష్కరించాలి.

\- ప్రశాంత్‌కుమార్, శాంతినగర్